నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
12 ఫిబ్రవరి 2025
పేజీలు 8


## విద్యార్థి ప్రతిభ

మూడు రకాలుగా వినియోగించుకొనే హైబ్రిడ్ సైకిల్‌ను నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలుకు చెందిన మాచిన్‌పల్లి గగన్ చంద్ర రూపొందించాడు. అతడు బల్మూర్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సాధారణ సైకిల్‌కు సౌర విద్యుత్ పలకలు, బ్యాటరీ, విద్యుత్ సర్దుబాటుకు వైపర్ మోటార్, సెల్ ఫోన్‌తో డిస్‌ప్లే, జీపీఎస్ అమర్చాడు. ఇది సౌర విద్యుత్‌తో ఒకసారి 30 కిలోమీటర్ల ప్రయాణిస్తుంది. సౌరశక్తి అందుబాటులో లేనప్పుడు విద్యుత్ బైక్‌లా చార్జింగ్ పెట్టి ద్విచక్ర వాహనంలా నడపొచ్చు. సాధారణ సైకిల్ లాగానూ తొక్కవచ్చు.

## రోజులు-ప్రాధాన్యం

### ఫిబ్రవరి 4

- ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'యునైటెడ్ బై యూనిక్'.

### ఫిబ్రవరి 2

ఏటా ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల రోజుగా నిర్వహిస్తారు. రామ్‌సర్ ఒప్పందం కుదిరిన రోజు అది. చిత్తడి నేలల పరిరక్షణకు 1971లో ఈ ఒప్పందం కుదిరింది. 1975, డిసెంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చింది. భారత్‌లో ఈ ఏడాది మరో నాలుగు చిత్తడి నేలలను రామ్‌సర్ సైట్ జాబితాలో చేర్చారు. అవి తమిళనాడులోని సక్కర్‌కొట్టయి పక్షుల అభయారణ్యం, తీర్థంగల్ పక్షుల అభయారణ్యం. సిక్కింలోని ఖేచెయోపల్రి, జార్ఖండ్‌లోని ఉద్వా సరస్సును కూడా ఈ జాబితాలో చేర్చారు. దీంతో భారత్‌లో ఈ జాబితాలోని మొత్తం రామ్‌సర్ సైట్ల సంఖ్య 89కి చేరింది. అత్యధికంగా తమిళనాడులో ఉన్నాయి. తర్వాత స్థానంలో ఉత్తరప్రదేశ్ ఉంది.

## అంతర్జాతీయం

### యూఎన్‌కు భారత్ నిధులు

- ఐక్యరాజ్య సమితికి ప్రతి ఏడాది కేటాయింపుల్లో భాగంగా 2025కు భారత్ 37.64 మిలియన్ల అమెరికా డాలర్లను కేటాయించింది. ఈ సంస్థకు క్రమం తప్పకుండా బడ్జెట్‌ను ఇస్తున్న 35 దేశాల్లో భారత్ కూడా ఒకటి. అలాగే 79వ ఐక్యరాజ్య సమితి సాధారణ సభ అధ్యక్షుడు ఫిలిమోన్ యంగ్ ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు భారత్‌లో పర్యటించారు. ప్రపంచ శాంతికి భారత్ చేస్తున్న కృషిని కొనియాడారు.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ

- జెనీవా కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా, అర్జెంటీనా నిష్క్రమించాయి. అలాగే ప్రపంచ ఆరోగ్య సంస్థ మరో అంశం రీత్యా కూడా వార్తల్లో ఉంది. గంబినాస్ లేదా ట్రిపనోసోమియాసిస్ రహిత దేశంగా గినియా ఘనతను దక్కించుకుందని ప్రకటించింది.



### యునెస్కో

- సముద్ర సహకార యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తూ ఇంటర్ గవర్నమెంట్ ఓషనోగ్రఫిక్ కమిషన్ (ఐవోసీ) ప్రకటించింది. యునెస్కో ఆధ్వర్యంలో ఐవోసీ పని చేస్తుంది. సముద్రంలోని వనరుల సుస్థిర వినియోగానికి, జల పర్యావరణం, సముద్రంలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ఉద్దేశించి సముద్ర సహకార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.

### ఫిలిప్పీన్స్

- వరి ధర విపరీతంగా పెరుగుతుండటంతో ఫిలిప్పీన్స్‌లో ఆహార భద్రతా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఆహార ధాన్యాల ధరల నియంత్రణకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

### జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్

- యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కాంపాక్ట్ ఇనిషియేటివ్‌లో జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ లిమిటెడ్ చేరింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనతో పాటు పలు సామాజిక ఆర్థిక సమానత్వ సాధన నిబంధనలను అమలు చేయాలన్న నిబంధన ఈ వ్యవస్థలో ఉంటుంది.




### మాల్దీవులు

- భారత్, మాల్దీవుల మధ్య ఎకువేరియన్ పేరుతో సైనిక విన్యాసం ప్రారంభమైంది. ఇది 13వ ఎడిషన్. దివేహి భాషలో ఎకువేరియన్ అంటే స్నేహితులు అని అర్థం.

### యూకే కొత్త చట్టం

- బాలల పట్ల అసభ్యంగా కృత్రిమ మేధను వినియోగించడాన్ని నేరంగా పరిగణిస్తూ యూకే కొత్త చట్టాన్ని తీసుకురానుంది. ఈ తరహా చట్టాన్ని చేయడం ప్రపంచంలో ఇదే ప్రథమం. అలాగే మరో అంశం రీత్యా కూడా యూకే వార్తల్లో ఉంది. ఈ దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ ససెక్స్ నుంచి నోయెల్ టాటా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.

### అమెరికా

- జెనీవా కేంద్రంగా పనిచేసే ఐక్యరాజ్య సమితి నుంచి అలాగే జోర్డాన్‌లోని అమ్మన్ కేంద్రంగా పనిచేసే యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ నుంచి అమెరికా నిష్క్రమించింది. అలాగే అమెరికా అధ్యక్షుడు వివిధ దేశాలపై టారిఫ్‌లు విధించారు. మెక్సికో, కెనడా, చైనా ఈ జాబితాలో ఉన్నాయి.

### న్యూజిలాండ్

- దేశంలోని రెండో అతిపెద్ద తరనకి పర్వతానికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తూ న్యూజిలాండ్ నిర్ణయం తీసుకుంది.



## క్రీడలు

### అండర్-19 టీ 20

- ఐసీసీ అండర్-19 మహిళల క్రికెట్‌లో భారత జట్టు విజయం సాధించింది. ఈ టోర్నీని జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు మలేషియాలో నిర్వహించారు. తుదిపోరులో భారత్ దక్షిణాఫ్రికాను ఓడించింది. 20 ఓవర్లలో దక్షిణాఫ్రికా 82 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ 11.2 ఓవర్లలో 84 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ (ఫైనల్)తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను గొంగడి త్రిష అందుకుంది. ఈ టోర్నీని భారత్ గెలవడం వరుసగా ఇది రెండోసారి. తొలిసారి భారత్ 2023లో గెలిచింది. అప్పట్లో ఇంగ్లండ్‌ను భారత్ ఓడించి కప్‌ను సొంతం చేసుకుంది.



### జాతీయ క్రీడలు

- జాతీయ క్రీడల్లో పురుషుల కబడ్డీ పోటీలో ఉత్తరప్రదేశ్ విజయం సాధించింది. తుది పోరులో ఆ జట్టు చండీగఢ్‌ను ఓడించింది.

### పికిల్ బాల్ లీగ్

- ప్రపంచ పికిల్ బాల్ లీగ్‌లో బెంగళూర్ జవాన్స్ జట్టు విజయం సాధించింది. తుది పోరులో పుణె యునైటెడ్ జట్టును ఓడించింది. ఈ క్రీడకు సంబంధించి ఇదే తొలి లీగ్.

### బీసీసీఐ అవార్డులు

- సీకే నాయుడు జీవితకాల సాఫల్య పురస్కారం- సచిన్ టెండూల్కర్
- పాలీ ఉమ్రిగర్ అవార్డ్- జస్ప్రీత్ బుమ్రా
- అంతర్జాతీయ ఉత్తమ మహిళా క్రికెటర్- స్మృతి మంధాన
- బెస్ట్ ఇంటర్నేషనల్ డెబ్యూ- సర్ఫరాజ్ ఖాన్
- బెస్ట్ ఇంటర్నేషనల్ డెబ్యూ (మహిళలు)- ఆశా శోభన
- బీసీసీఐ స్పెషల్ అవార్డ్- రవిచంద్రన్ అశ్విన్

## జాతీయం

### ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్

- ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ ఏర్పాటుకు సంబంధించి ఫ్రేమ్ వర్క్ అధికారికంగా అమల్లోకి వచ్చిందని పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందులో 27 దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. అయితే ర్యాటిఫై చేసిన దేశాలు మాత్రం నికరాగువా, ఎస్వాతిని, ఇండియా, సోమాలియా, లైబీరియా.

### వాటర్‌షెడ్ యాత్ర



- వాటర్ షెడ్ అభివృద్ధికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'వాటర్ షెడ్' యాత్రను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించారు. ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకానికి సంబంధించి కూడా ఇందులో అవగాహన కల్పించనున్నారు.

### యూజీసీ ముసాయిదా

- వైస్ చాన్స్‌లర్ల ఎంపికతో పాటు విశ్వవిద్యాలయాల నిర్వహణకు సంబంధించి యూజీసీ ఇటీవల ప్రకటించిన ముసాయిదాను వ్యతిరేకిస్తూ ఆరు రాష్ట్రాలు తీర్మానం చేశాయి. అవి తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్. రాష్ట్రాలకు పాత్ర లేకుండా చేయడం అంటే సమాఖ్య విధానానికి వ్యతిరేకం అనే అంశాన్ని ఆ రాష్ట్రాలు తీర్మానంలో పేర్కొన్నాయి.

### పోర్ట్ విలియం పేరు మార్పు

- కోల్‌కతాలోని పోర్ట్ విలియం పేరును విజయ్ దుర్గ్‌గా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. నిజానికి ఈ కోటను 1696లో నిర్మించారు, 1706లో పూర్తయింది. అయితే ప్రస్తుతం ఉన్న భవన రూపం మాత్రం 1758లో నిర్మాణం ప్రారంభం కాగా 1781లో పూర్తయింది.



### వైట్ టైగర్ బ్రీడింగ్ సెంటర్

- దేశంలో తొలి వైట్ టైగర్ బ్రీడింగ్ సెంటర్‌ను మధ్యప్రదేశ్‌లోని రెవా జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర జూ ప్రాధికార సంస్థ ప్రకటన చేసింది.

### అగ్రి హబ్

- వ్యవసాయ రంగంలో అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగించుకొనేందుకు ఐఐటీ ఇండోర్, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కరవు, వరదలు, ఉత్పాదకత తదితర అంశాలపై అంచనా వేసేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది.

### ఉమ్మడి పౌరస్మృతి

- ఉమ్మడి పౌర స్మృతిపై గుజరాత్ రాష్ట్రం ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 44లో ఉమ్మడి పౌర స్మృతికి సంబంధించిన అంశాలుంటాయి. ఇప్పటికే ఈ ఆర్టికల్‌ను ఉత్తరాఖండ్ అమలు చేస్తుంది. గుజరాత్‌లో ఏర్పాటైన కమిటీకి రంజనా దేశాయ్ నాయకత్వం వహించనున్నారు.

### ఏఐ విశ్వవిద్యాలయం



- దేశంలో మొట్టమొదటి కృత్రిమ మేధ విశ్వవిద్యాలయం మహారాష్ట్రలో ఏర్పాటు చేయనున్నారు. అయితే ప్రపంచంలో మాత్రం తొలి ఏఐ విశ్వవిద్యాలయం అబుధాబిలో ఏర్పాటైంది. మహ్మద్ బిన్ జాయెద్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అని దాన్ని వ్యవహరిస్తున్నారు.

## తెలంగాణ

### ఎస్సీ వర్గీకరణకు చట్ట సభల ఆమోదం

- రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉభయ సభలు అనుమతించాయి. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ చేసిన పలు సిఫారసులకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని మొత్తం 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించడం, ఉద్యోగాల భర్తీ విధానం, రోస్టర్ పాయింట్ల విభజన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే క్రీమీలేయర్ సిఫారసును తిరస్కరించింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ప్రాతినిధ్యం ఆధారంగా అత్యంత వెనుకబడిన కులాలను గ్రూప్-1లో మధ్యస్త లబ్ధి పొందిన కులాలను గ్రూప్-2లో, మెరుగైన ప్రయోజనాలను పొందిన కులాలను గ్రూప్-3లో చేర్చింది.



### డ్రై పోర్ట్

- సంగారెడ్డి జిల్లా మనోహరాబాద్‌లో డ్రై పోర్ట్ ప్రభుత్వం నిర్మించనున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ డ్రై పోర్ట్‌ను నిర్మిస్తున్నాయి. ఇందుకు 350 ఎకరాల భూసేకరణ చేశారు. సాధారణంగా సముద్ర ప్రాంతాల్లో పోర్టులుంటాయి. కానీ సముద్రం లేని చోట నిర్మించే పోర్టులనే డ్రై పోర్ట్ అంటారు.

### ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం

- ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్ వద్ద భూమి పూజ నిర్వహించారు. సుమారు 26 ఎకరాల్లో నిర్మించే ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీల థియేటర్లు, అవయవ మార్పిడి కేంద్రం, 750 సీట్ల సామర్థ్యంతో భారీ ఆడిటోరియం ఉండనున్నాయి. వైద్యులు, ఇతర స్టాఫ్ కోసం నివాస గృహ సముదాయాలు నిర్మించనున్నారు. హెలీప్యాడ్‌లు దిగేందుకు కూడా సౌకర్యాన్ని కల్పించనున్నారు.



### రూ. 5337 కోట్లు

- రైల్వే బడ్జెట్‌లో తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు రూ. 5337 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. తెలంగాణలో 2014 నుంచి ఇంతవరకు 753 కిలోమీటర్ల కొత్త ట్రాక్ నిర్మించినట్లు ఆ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో 100% రైల్వే విద్యుదీకరణ పూర్తయింది. రూ. 1992 కోట్లతో 40 అమృత్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు.

### జాతీయాదాయ పంపకాల్లో 15వ స్థానం

- కేంద్ర పన్నుల్లో తెలంగాణ రాష్ట్ర వాటాగా వచ్చే ఆదాయం 2.1% ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంపకాల్లో తెలంగాణ 15వ స్థానంలో ఉంది. దేశంలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ 17.93%, బీహార్‌కు 10% అందుతున్నాయి. ఆ తర్వాత మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. 2024-25లో తెలంగాణకు రూ. 27,050 కోట్లు, 2025-26లో రూ 29,898 కోట్లు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది.


వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411


